andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8 । కనిష్ఠం 19.8

ఆదిలాబాద్
జిల్లా వార్తలు


# జన.. జాతర



● నాగోబా జాతరకు బారులు తీరిన భక్తులు( ఇన్‌సెట్ ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో



● ఆలయంలో పూజల అనంతరం బయటకు వస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- నాగోబా జాతరకు పోటెత్తిన భక్తులు, ఆదివాసీలు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో గందరగోళంగా ప్రజాదర్బార్
- సమస్యలు పరిష్కరించాలని మొర పెట్టుకున్న గిరిజనులు
- ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలు గొప్పవి : మంత్రి
- అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు : కలెక్టర్
- ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి.. దరఖాస్తుల స్వీకరణ
- దర్బార్‌కు వచ్చి.. వెళ్లిపోయిన ఎంపీ గోడం, ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి)/ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా జాతరకు భక్తులు, ఆదివాసీలు భారీగా పోటెత్తారు. నాగోబాకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నాగోబా జాతరలో భాగంగా మూడవ రోజు శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన కనిపించింది. దర్బార్‌కు హాజరైన ఆదివాసీ లు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారుల ముందు మొర పెట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధ్యక్షతన ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ దర్బార్‌కు ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, డీఎఫ్‌వో ప్రశాంత్‌బాజీరావు పాటిల్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, తదితరులు హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి గోండు, కోలాం, ప్రధాన్, ఆంద్, నాయక్‌పోడ్, తోటి, చెంచు, మన్నెవార్, కోయ ఆదివాసీ 9తెగల ప్రజలు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఆదివాసీల నుంచి శాఖల వారీగా దరఖాస్తులను స్వీకరించారు. అయితే ప్రజాదర్బార్ వేదికగా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన అధికారులు.. దరఖాస్తులతోనే సరిపెట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలాగే గతంలో తీసుకున్న దరఖాస్తులకు ఎలాంటి పరిష్కారం చూపారో స్పష్టతను ఇచ్చే ప్రయత్నం చేయలేదు. దీనిపై పలువురు ఆదివాసీ సంఘాల నేతలు మండిపడ్డారు. శాఖల వారీగా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాదర్బార్‌కు హాజరైనా.. ఏ ఒక్క శాఖ పరిధిలోని సమస్యపై చర్చించి పరిష్కారం చూపిన దాఖలాలు లేవు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజాదర్బార్‌ను నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మొక్కుబడిగానే దర్బార్ ముగిసిందన్న వాదనలున్నాయి.

### మెరుగైన విద్యా అవకాశాలు కల్పించండి

పేదరికం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆదివాసీలకు మెరుగైన విద్య అవకాశాలు అందించాలని ఆదివాసీ తెగల నాయకులు అధికారుల

(తరువాయి 4వ పేజీలో...)

## ప్రస్తుతం నక్సల్స్ ప్రభావం లేదు : గౌస్‌ఆలం, ఎస్పీ



గతంలో నక్సల్స్ ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కొంత ఇబ్బందికరంగా ఉండేది. ప్రస్తుతం నక్సల్స్ ప్రభావం ఏమీ లేదు. ఆదివాసీల సంక్షేమం కోసం పోలీసు శాఖ నిరంతరంగా కృషి చేస్తుంది. ముఖ్యంగా మెగా వైద్య శిబిరాలు, క్రీడలను నిర్వహించి ఆదివాసీలతో స్నేహభావంగా పోలీసు శాఖ వ్యవహరిస్తుంది. గత 79 ఏళ్లగా నాగోబా దర్బార్‌ను నిర్వహించుకుంటున్నాం. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 500ల మంది పోలీసు సిబ్బందితో భద్రత కల్పిస్తున్నాం. షెడ్యూల్ ఏరియాలో చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఆదివాసీలకు న్యాయ పరమైన సలహాలతో పాటు చట్టాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. మీ కోసమే పోలీసులు అన్న భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నాం.

## ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలకు విరాసత్ : రాజర్షిషా, కలెక్టర్



అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం. అలాగే త్వరలోనే ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలకు విరాసత్ అవకాశాన్ని కల్పిస్తాం. ప్రతియేటా దర్బార్ ద్వారా సమస్యకు పరిష్కారం చూపుతున్నాం. ఈ యేడు దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా విద్య, వైద్యం, అన్ని వసతులను కల్పిస్తున్నాం. ఐటీడీఏ పరిదిల గిరిజన పోషణ అభియాన్ పథకానికి శ్రీకారం చుట్టాం. రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన పోష్టిక ఆహారాన్ని అందిస్తున్నాం. పీవీటీజీ తెగల కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తూ అందిస్తున్నాం. ఎన్జీవోల ద్వారా ఆదివాసీ విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాష పై పట్టు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. భవిష్యత్తుల్లో ఉన్నత విద్య అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆదివాసీ తెగలకు కమ్యూనిటీ హాల్స్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా భూములకు సాగునీరు, సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. టైగర్‌జోన్ మినహా ఇతర ఏజెన్సీ ప్రాంతంలో అన్ని రకాల సంక్షేమ పథకాల అమలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఐటీడీఏ ప్రత్యేకంగా గిరిజన ఎంప్లాయిమెంట్ సెల్‌ను ఏర్పాటు చేశాం.

## ఆదివాసీలు ప్రకృతిని ఆరాదిస్తారు : మంత్రి సీతక్క



ఆదివాసీలు సంస్కృతీ, సంప్రదాయాలకు కట్టుబడి ప్రకృతిని ఆరాధిస్తారు. భారత రాజ్యాంగంలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఆదివాసీలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌లో ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపును ఇచ్చారు. ఎక్కడో పుట్టి ఆదిలాబాద్ మారుమూల గ్రామాల్లో పని చేసిన హైమండ్ డార్ఫ్ ఎలిజబెత్ దంపతుల కృషి ఫలితంగానే నాగోబా ప్రజాదర్బార్‌ను నిర్వహించుకుంటున్నాం. అప్పటి ప్రభుత్వానికి వారిచ్చిన ప్రతిపాదనలతోనే దర్బార్‌ను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. నాగోబా జాతర పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిని సారించారు. గతంలో నాగోబా ఆశీస్సులు తీసుకున్న తర్వాతనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ఎమ్మెల్యేంతా కలిసి ప్రత్యేక సమావేశమై సమస్యల పై ముఖ్యమంత్రితో చర్చిస్తాం. ఆదివాసీ బిడ్డగా ప్రజాదర్బార్‌కు హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉంది. సంస్కృతి సాంప్రదాయాలను అందరు గౌరవించాలి. మనల్ని మనం కాపాడుకోవడమే అసలైన సాంప్రదాయం. ఆదివాసీలది గొప్ప సంస్కృతి వహిళలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆడపిల్లకు ఎదురుకట్నం ఇచ్చి పెళ్లిలు చేసుకునే గొప్ప సంస్కృతి సాంప్రదాయం ఆదివాసీల్లో ఉంది. గోండ్వాన రాజ్యంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేవారు. మన పూర్వీకులు ఇచ్చిన ఆచార సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలి.

## ఏజెన్సీపై ప్రత్యేక అభిమానం : వెడ్మబొజ్జు, ఎమ్మెల్యే



ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నాగోబా ఆలయం పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక అభిమానం. ఎన్నికల సమయంలో నాగోబా ఆశీస్సులు తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే విధంగా మేస్రం వంశీయులు కృషి చేయడం ఎంతో అభినందనీయం. ఆకట్టుకునే వేషాధారణ, అలంకరణతో మేస్రం వంశీయులు నాగోబాకు ప్రత్యేక పూజలు చేస్తారు. పాదయాత్రగా వెళ్లి గంగాజలంను తీసుకుని రావడం ఎంతో అద్భుతం. ప్రత్యేకమైన పూజలు చేసి మహాపూజ కార్యక్రమంతో జాతరను ప్రారంభిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ప్రజాదర్బార్‌ను నిర్వహించడం కొంత ఇబ్బందికరంగా మారింది. అటవి శాఖ మంత్రి కొండసురేఖ కూడా దర్బార్‌కు రావాల్సి ఉండేది. కాని కోడ్ కారణంగా రాలేక పోయారు. నాగోబా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం. సమ్మక్క సారక్క జాతర తర్వాత రెండో అతిపెద్ద జాతర నాగోబా జాతరకు గుర్తింపు ఉంది.

## ఎన్నికల్లోనే జైశ్రీరామ్ : సోయం బాపురావు, మాజీ ఎంపీ



కొందరు నేతలు ఎన్నికల సమయంలో జై శ్రీరామ్ అంటారు. ఎన్నికల తర్వాత నై శ్రీరామ్ అంటూ ఎగనామం పెడతారని మాజీ ఎంపీ సోయంబాపురావ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివాసీలు అన్ని విషయాలను తెలుసుకున్న తర్వాతనే మాట్లాడాలి. గతంలో ఎన్నో సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేశాం. కాని ఏ సీఎం, ప్రధాని ఆదివాసీల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. మునుపెన్నడు లేని విధంగా ఆదివాసీల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకొచ్చారు. ఇప్పటికే ఆదివాసీల పెద్దలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి పలు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. వచ్చే యేడాదిలోగా ఆలయ సమస్యలు అన్ని పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కొన్ని పార్టీల పట్ల ఆదివాసీలు జాగ్రత్తగా ఉండాలి.



సీసీ కెమెరాకు చిక్కిన హైనా

# హరితవనంలో హైనా

● వాటి రక్షణకు చర్యలు : ఎఫ్‌ఆర్‌వో గులాబ్‌సింగ్

మావల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మావల హరితవనంలో క్రూర జంతువు హైనా సంచరిస్తున్నట్లు ఎఫ్ ఆర్‌వో గులాబ్ సింగ్ ధ్రువీకరించారు. ఈ మేరకు సీసీ ఫుటేజీలో క్రూర జంతువు హైనా సీసీ కెమెరాలకు చిక్కింది. ఈ నెల 29న రాత్రి సీసీ ఫుటేజీని పరిశీలించగా హైనాగా గుర్తించినట్లు తెలిపారు. మావల హరితవనం దట్టమైన అటవీ ప్రాంతం అవడంతో ఆవాసంగా ఇక్కడి వచ్చాయన్నారు. మహారాష్ట్ర సమీపంలోని తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉంటాయని బావిస్తున్నామనరు. ఇవి ఒక ఆడ, మగ కలసి ఉంటాయన్నారు. సీసీ కెమెరాలు పరిశీలించే క్రమంలో ఈ విషయం బయట పడిందన్నారు. హరితవనంలో ఇంకా ఎన్ని హైనాలు ఉన్నాయో? తెలుసుకుంటామన్నారు. హైనాలు చాలా బలిష్టంగా ఉంటాయని, పులులను కూడా సింహాలను సైతం వేటాడి తింటాయన్నారు. అయితే వీటిని గుర్తించి రక్షించేందుకు చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు.

## 'డెయిరీ ఉత్పత్తులను ఆదరించాలి'

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ పదార్థాలు నాణ్యమైనవి ఉంటాయని ప్రజలు వాటిని ఆదరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళ శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీని ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మలవీయతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళ సంఘాలకు పలు సూచనలు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళ సంఘాలకు రుణాలు అందించి వ్యాపారల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు.

# భరోసా దక్కేనా!?

- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల భారీ ఆశలు
- ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ నిధుల మంజూరీపై ఆసక్తి
- ఎయిర్‌పోర్టు, సీసీఐపై ఆశలు వదలుకుంటున్న జిల్లా వాసులు



● ఆదిలాబాద్ రైల్వే స్టేషన్

ఆదిలాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న 2025-26 సాధారణ బడ్జెట్‌పై జిల్లా వాసులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. ఈ సారైన బడుగు జిల్లాకు భరోసా దక్కుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీసారి కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరుగక పోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే కనిపిస్తుంది. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో సాధారణ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. దీనిపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తుంది. కేంద్ర బడ్జెట్‌లో పార్లమెంట్ సభ్యులు గోడంనగేష్ జిల్లాకు ఏ మేరకు నిధులను తీసుకొస్తారోనన్న ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది.

### నిధుల కోసం ఎదురుచూపులు

దూర భారాన్ని తగ్గించేందుకు ఆదిలాబాద్-ఆర్మూర్ వయా పటాన్ చెరువు రైల్వేలైన్ నిర్మాణానికి గతంలోనే కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు సరిపడ నిధులను మంజూరు చేయక పోవడంతో సర్వే దశలోనే కనిపిస్తుంది. ఇటీవలే సర్వే పనులు దాదాపుగా పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే రైల్వే లైన్ నిర్మాణం పనులు ముందుకు సాగుతాయని చెబుతున్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ జిల్లాలో పర్యటించి ఎన్నిల ప్రచారాన్ని చేపట్టారు. అప్పట్లో జిల్లా అభివృద్ధికి ఎలాంటి హామీలు ఇవ్వలేదు. దీంతో కొంత నిరాశనే ఎదురైంది. అయిన బీజేపీ పార్టీకి చెందిన అభ్యర్థినే పార్లమెంట్ సభ్యుడిగా జిల్లావాసులు గెలిపించారు. దీంతోనైనా కేంద్ర ప్రభుత్వం జిల్లాపై కనికరం చూపుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా.. గత పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీ పార్టీకి చెందిన అభ్యర్థిని గెలిపించినప్పటికీ.. ఎలాంటి ప్రయోజనం దక్కలేదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాగా, ఈసారి పార్లమెంట్ స్థానంతో పాటు ఆదిలాబాద్ అసెంబ్లీ స్థానాన్ని సైతం బీజేపీ పార్టీకే కట్టబెట్టడంతో జిల్లాలో పార్టీ బలపడిందంటున్నారు.

### సీసీఐ ఆశలు గల్లంతేనా?

ఎన్నికల సమయంలో సీసీఐ పరిశ్రమను పునరుద్ధరిస్తామని హామీలు ఇస్తున్న రాజకీయ పార్టీలు ఎన్నికల తర్వాత ఆ విషయాన్నే పూర్తిగా మర్చిపోతున్నాయంటున్నారు. దీంతో జిల్లా వాసుల ఆశలు గల్లంతవుతున్నాయి. ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ అంశం ఉంటుందని అందరు అంచనా వేస్తున్నారు. కాని ప్రభుత్వం బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు కేటాయిస్తుందో వేచిచూడాల్సి ఉంది. ప్రతిసారి ఎన్నికల సమయంలో సీసీఐని తెరమీదకు తెస్తున్న బీజేపీ దాననుగుణంగా నిధులను కేటాయించక పోవడంతో జిల్లా వాసుల నిరాశకు గురవుతున్నారు. అలాగే ఆదివాసీలు అధికంగా నివసిస్తున్న ఆదిలాబాద్ జిల్లాకు గిరిజన యూనివర్సిటీ, కేంద్రీయ విశ్వ విద్యాలయం, ఎయిర్‌పోర్టును మంజూరు చేయాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

### 'కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించాలి'

**ఆదిలాబాద్ రూరల్:** ఆదిలాబాద్ అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనల మల్లేష్ అన్నారు. శుక్రవారం మాధవరావ్ విజ్ఞాన కేంద్రంలో రౌండ్ సమావేశం టేబుల్ నిర్వహించారు. వామపక్ష పార్టీలతోపాటు ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. నేటి నుంచి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వెనకబడిన ఆదిలాబాద్‌కు బడ్జెట్‌లో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, సీసీఐని పునః ప్రారంభించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ వెనకబడిన జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చెందాలంటే మూతపడిన సీసీఐని తెరిపించాలన్నారు. అదే విధంగా ఆదిలాబాద్ ప్రజల చిరకాలవంఛ అయిన ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్‌తోపాటు విమానాశ్రయం, టెక్స్ టైల్స్ పార్కును ఏర్పాటు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు బీజేపీ రుణపడి ఉందని, ఇక్కడి నుంచి రెండు సార్లు ఎంపీ స్థానాలతోపాటు ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 8 మంది ఎమ్మెల్యేల్లో, నలుగురు ఉమ్మడి జిల్లాకు చెందిన వారే ఉన్నారన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో అధిక నిధులు తీసుకురావడంతోపాటు సీసీఐ పునః ప్రారంభంపై ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. కానీ పక్షంలో పోరాటం చేయాలని వారికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గెలిపించిన ప్రజలే ఓడిస్తారన్న విషయాన్ని గ్రహించాలని హెచ్చరించారు.



శ్యామ్‌పూర్‌లో బుడందేవ్‌కు పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

## బుడుందేవ్‌కు ఇన్‌చార్జి మంత్రి పూజలు

ఉట్నూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మెస్రం గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబాతో పాటు నందీశ్వరుడైన బుడందేవ్‌ను కొలుస్తున్నారు. ఫిబ్రవరి మూడవ తేదీ నుంచి మెస్రం గిరిజనుల పూజలతో ప్రారంభంకానున్న శ్యాంపూర్ బుడందేవ్ జాతరలోని ఆలయాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అక్కడి నుంచి ఇంద్రవెల్లి మండలంలోని నాగోబా జాతరకు చేరుకున్నారు. మంత్రి వెంట మాజీ ఎంపీ సోయంబాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రంసక్కు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తుమల్లేష్, కందిశ్రీనివాస్‌రెడ్డి, ఆత్రం సుగుణక్క, షాంపూర్ మాజీ సర్పంచ్ జగదీశ్‌జాదవ్, తదితరులున్నారు.

## తప్పుడు ప్రచారం మానుకోవాలి : సీతక్క

నేరడిగొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండి రైతులకు రూ.లక్ష రుణమాఫీ సరిగ్గా చేయకలేకపోయిందని, ఏ గ్రామంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రేషన్ కార్డు, దళిత బంధు, బీసీ బంధు, గిరిజన బంధు, అనుకుంటూ పదేళ్ల కాలం వెళ్లదీశారన్నారు. ఇప్పుడు ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల కరెంట్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలు, మహిళలకు వడ్డీ లేని రుణాలు ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు అప్పుడు పేద ప్రజల కోసం ఎప్పుడు కూడా పాటుపడలేదన్నారు. ఇందులో బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, ఆదిలాబాద్ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, కొమురం కోటేష్, ప్రఫుల్ చందర్ రెడ్డి, నారాయణరెడ్డి, బద్దం పోతారెడ్డి, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.



కడెం మండలం కల్లెడ, బెల్లాల్‌కు చెందిన ఏనుగుల బుచ్చవ్వ, బెల్లపు సత్తవ్వ(ఫైల్)

జగిత్యాలలోని విద్యానగర్, కొత్తవాడకు చెందిన పీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ(ఫైల్)

# కుంభమేళాలో తప్పిపోయిన నలుగురు అక్కాచెల్లెళ్లు

- గత నెల 28న పుణ్య స్థానానికి వెళ్లిన మహిళలు
- ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆందోళనలో కుటుంబ సభ్యులు
- మూడు రోజులుగా కుంభమేళాలో వెతుకుతున్న తోటి యాత్రికులు

4లో

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితంగా వాహనదారులు గమ్యస్థానాలకు చేరుకోవాలని ఇన్‌చార్జి డీటీసీ దుర్గ ప్రసాద్ అన్నారు. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు రవాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపును టీడబ్ల్యూఆర్‌జేసీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి బెలూన్‌లను గాలిలో వదిలారు. అనంతరం రోడ్డు భద్రత, ప్రమాద రహిత డ్రైవింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతపై నెల రోజుల పాటు రవాణ శాఖ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరణ, కారు వారికి సీట్ బెల్టుతోపాటు ఆయా పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు, టూ కే రన్ లాంటి కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా ఇండ్లకు చేరుకునేల ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు కూడా నియమ నిబంధనలను తెలుసుకంటు తల్లిదండ్రులు, చుట్టూ పక్కల వారికి తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ అల్లి శ్రీనివాస్, ఏఎంవీఐలు మర్గం రవీందర్, హరింద్ర, ఫణిధర్, టీడబ్ల్యూఆర్‌సీ ప్రిన్సిపల్ అనిల్, కానిస్టేబుళ్లు మంజు భార్గవి, ప్రేమ్ కుమార్, మోయిస్, కలీం పాల్గొన్నారు.



గాలిలో బెలూన్‌లను వదులుతున్న ఇన్‌చార్జి డీటీసీ దుర్గప్రసాద్


ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేస్తున్న ఎస్సై సందీప్

### ద్విచక్ర వాహనదారులకు
## ఉచితంగా హెల్మెట్ల పంపిణీ

దిలావర్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వారికి దిలావర్‌పూర్ ఎస్సై సందీప్ హెల్మెట్లను శుక్రవారం సాయంత్రం పంపిణీ చేశారు. కాల్వ గ్రామానికి చెందిన యువజన నాయకుడు గన్నారపు సూర్య తన తండ్రి గన్నారపు భూమయ్య జ్ఞాపకార్థం 15 బ్రాండెడ్ హెల్మెట్లను ప్రధానం చేయగా... సిర్గాపూర్‌లో జాతీయ రహదారిపై వెహికల్ చెకింగ్ చేస్తూ హెల్మెట్ లేనివారికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్లను ఉచితంగా ఇచ్చిన గన్నారపు సూర్యను ఎస్సై సందీప్ అభినందించారు. కార్యక్రమంలో కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ మహేష్, సతీష్, ప్రసాద్, నర్సయ్య, సాయేందర్, తదితరులు పాల్గొన్నారు.

### 13వ తేదీ వరకు పెంపుడు కుక్కలకు
## ఉచితంగా రాబిస్ వ్యాక్సినేషన్


ఖానాపూర్‌లో పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్ ఇస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

ఖానాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13వ తేదీ వరకు ఖానాపూర్‌లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సినేషన్ ఇవ్వనున్నట్లు ఆ శాఖ ఖానాపూర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాంచందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాఖ ఆవరణలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ పక్షోత్సవాలు, పశుసంవర్ధకశాఖ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు వ్యక్తులకు సంబంధించిన 12 పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. ఈ నెల 13వ తేదీ వరకు పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సిన్‌ను ఇవ్వనున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుక్కలను పెంచుతున్న యజమానులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

లోకేశ్వరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన భౌతిక, రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో మన్మథ్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన సంజన ప్రథమ స్థానం, అభినయ తృతీయ స్థానం, రాజూర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన సాయితేజ ద్వితీయస్థానంలో నిలిచారని టాలెంట్ టెస్ట్ నిర్వాహకులు దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాంజీ గోండు చరిత్రను పరిరక్షించుకోవాలి

● పాఠ్యాంశంగా చేర్చాలి ● కవి సమ్మేళనంలో సాహితీవేత్తలు


చర్చల్లో పాల్గొన్న కవులు, రచయితలు

నిర్మల్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసి పోరాట యోధుడు, తొలిదశ స్వాతంత్ర సంగ్రామోద్యమ సమయంలోనే నిజా బ్రిటిష్ సైన్యాలపై వీరోచితంగా పోరాడిన యోధుడు రాంజీ గోండుపై శనివారం జిల్లా కేంద్రంలో సాహితీగోష్టి నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాకు చెందిన కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... రాంజీ గోండుచరిత్ర భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మరుగునపడిన రాంజీగోండు చారిత్రక నేపథ్యం పాఠ్యాంశంగా చేర్చాలని పేర్కొన్నారు. చరిత్ర ఉమ్మడి జిల్లాలో రోహిల్లా సైన్యాలను ఏర్పరచి తన ప్రాంత అస్తిత్వం కోసం తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడిన చారిత్రక అంశంపై పలువురు సాహితీ వేత్తలు, కవులు కవితలను వినిపించారు.

పలువురు చరిత్రకారులు, వ్యాసకర్తలు 165 సంవత్సరాల క్రితం నిర్మల్ జిల్లా చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ఇదే సమయంలో నిజాం రజాకార్లతో బ్రిటిష్ సైన్యం ఏకమై దొంగదెబ్బతీసి నిర్మల్ పట్టణ సమీపంలోని మర్రిచెట్టుకు ఒకేసారి రాంజీగోండుతో సహా ఏకంగా 1000 మందిని ఉరితీసిన చరిత్రను వ్యాసకర్తలు వివరించారు. ఈ సందర్భంగా రాంజీగోండు వీరోచిత పోరాటం అంశాలపై వినిపించిన కవితలు శ్రోతలను అలరించాయి.

దాదాపు 50 మంది వరకు పద్య కవిత్వం, వచన కవిత్వం వినిపించగా మరో 10 మంది వరకు చారిత్రక నేపథ్యం ఉన్న వ్యాసాలను రచనల రూపంలో నివేదించారు. వీటన్నింటిని కలిపి రాంజీగోండు స్మారక సమితి ఆధ్వర్యంలో సంకలన గ్రంథంగా తీసుకు రానున్నట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాంజీ గోండు స్థానిక సమితి సమన్వయకర్తలు పోలీస్ భీమేష్, రాం నరేష్, దొండి శ్రీనివాస్, రాసం శ్రీధర్, బి. వెంకట్, ప్రముఖ చరిత్రకారుడు కట్కం మురళి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు చక్రధారి, దామెర రాములు, బొందిడి పురుషోత్తం, అంబటి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# యూటర్న్ ఏర్పాటు చేయాలని రోడ్డుపై రాస్తారోకో

ముథోల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా తాండ గ్రామస్థులు రోడ్డుపై యూటర్న్ (డివైడర్ల ఓపెనింగ్) ఏర్పాటు చేయాలని శుక్రవారం భైంసా - బాసర రహదారిపై రాస్తారోకోకు దిగి తమ నిరసన వ్యక్తపరిచారు. భైంసా నుంచి వయా పకీరాబాద్ బోధన్ వరకు సుమారు 50 కిలోమీటర్ల పొడుగున నిర్మిస్తున్న 161బి, డబుల్‌రోడ్డు పనుల్లో భాగంగా ముథోల్, తరోడా గ్రామాల మధ్య తరోడా తాండకు వెళ్లే మార్గం వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని తాండావాసులు డిమాండ్ చేశారు. తాము వెళ్లాలంటే కిలోమీటర్ చుట్టూ తిరిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు, కాంట్రాక్టర్‌కు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఇచ్చితంగా రోడ్డు పైన యూటర్న్ ఏర్పాటు చేసినట్లయితే సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. సుమారు 25 నిమిషాల పాటు రోడ్డుపై రాస్తారోకో చేయడంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. తమ గ్రామంలో 50 కుటుంబాలకు గాను 300ల మంది జనాభా 200ల ఓటర్లు ఉన్నారని అను నిత్యం పనికోసం రాకపోకలు కొనసాగిస్తామని దీనిలో భాగంగా యూటర్న్ ఏర్పాటు చేయకపోవడంతో సుమారు ఒకవైపు కిలో మీటర్ మరో పక్క అర కిలో మీటర్ తిగిరిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు కచ్చితంగా యూటర్న్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో సీఐ తమ కోరిక మేరకు సంబంధించిన అధికారులతో మాట్లాడి తమకు న్యాయం జరిగేలా చూస్తానని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. దీంతో సీఐ, ఎస్సైలు ఇరువైపులా ఆగిపోయిన వాహనాల ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో తాండ వాసులు, తదితరులు ఉన్నారు.


రాస్తారోకో చేస్తున్న తరోడా తండావాసులు

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధిత కుటుంబాలకు బాసట

భైంసా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహయం అందించి బాసటగా నిలుస్తున్నామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలవాసులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనారోగ్యపు కారణాలతో డబ్బులు చెల్లించి వైద్య సేవలు పొందిన బాధిత కుటుంబాలు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోకూడదనే లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తోడ్పాటునిస్తున్నామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం పొందేందుకు గాను ఆసుపత్రులలో చెల్లించిన బిల్లులతో పాటు చికిత్సలకు సంబంధించిన పూర్తి పత్రాలతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.ఇందులో డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, మహ్మద్ షఫీ, శ్రీనివాస్, ఓం ప్రకాష్, నరేందర్, మాజీ సర్పంచ్ ప్రకాష్ ,సదాశివ్ పాటిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



### కుంభమేళాలో తప్పిపోయిన నలుగురు అక్కాచెల్లెళ్లు

(3వ పేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న కుంభమేళాలో పుణ్యస్నానాన్ని ఆచరించేందుకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మహిళలు తప్పిపోయారు. ఇందులో జగిత్యాలకు చెందిన వీర్ల నర్సవ్వ, ఆదిరాజవ్వ, కడెం మండలం కల్లెకు చెందిన ఏనుగుల బుచ్చవ్వ, కడెం మండలం పెద్ద బెల్లాల్ ఉప్పరిగూడెంకు చెందిన బెల్లపు సత్తవ్వ అనే నలుగురు అక్కచెల్లెళ్లు ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మహిళలు తప్పిపోవడంతో కుటుంబ సభ్యులంతా ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... జనవరి 28వ తేదీన జగిత్యాల నుండి ట్రావెలర్‌లో మొత్తం 12 మంది యాత్రికులు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న కుంభమేళాకు బయలుదేరారు. 29వ తేదీ సాయంత్రానికి వీరంతా కుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. అదే రోజు సాయంత్రం త్రివేణిసంగమంలో పుణ్యస్నానాన్ని ఆచరించేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో ఫోన్‌లు అన్నీ ఒకరి వద్ద ఉంచారు. మొత్తం 12 మంది స్నానమాచరించేందుకు వెళ్లగా భారీ జన సందోహం నడుమ వీరంతా విడిపోయారు. దీంతో ఫోన్లు ఉన్న వారంతా ఒక దగ్గర ఉండిపోగా ఫోన్లు లేని నలుగురు మహిళలు ఒకవైపు పోయినట్లు చెబుతున్నారు. కుంభమేళాలో భారీగా జన సందోహం నిలబడి ఉండడంతో మూడు రోజులుగా వారి ఆచూకీ కోసం వారితో పాటు వెళ్లిన మరో ఎనిమిది మంది యాత్రికులు వెతుకుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని కుంభమేళాలో స్థానికంగా పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కుంభమేళాలో తప్పిపోయిన ఈ నలుగురు మహిళలను వెతికేందుకు వారి కుటుంబ సభ్యులు సైతం కడెం, జగిత్యాల నుండి ఐదుగురు బృందం బయలుదేరి వెళ్లినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం వారు మార్గమధ్యంలో ఉన్నామని శనివారం ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటామని చెబుతున్నారు. కుంభమేళాలో తప్పిపోయిన తమ కుటుంబసభ్యుల ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్ 8019424643కి సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## రైతులకు అందుబాటులో పాస్ఫరస్


రైతులకు పాస్ఫరస్ పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

కుంటాల, జనవరి, 31 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై పాస్ఫరస్ అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి విక్రమ్ తెలిపారు. వరి పొలంలో రైతులు ఏదైన ఎరువులో కలిపి వెదజల్లుకుంటే కొంత మేర లాభం చేకూరుతుందని రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుంటాలలో శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గణేష్, రవి తదితరులు ఉన్నారు.

### రైతుల సమస్యలు పరిష్కరించాలి

కుంటాల, జనవరి, 31 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన రైతులు పాత బూర్గుపెల్లి శివారులో గల పంట పొలాలకు వెళ్లే రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

### 'సాగు నీటిని విడుదల చేయండి'

బోథ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర, కనుగుట్ట శివారం గ్రామాల రైతులు బోథ్, కరత్వాడ చెరువు నుండి కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని శుక్రవారం రైతులు డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంటలు ఎండిపోతున్నాయని కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసినట్లయితే పెద్దవాగు పైన ఉన్న చెక్ డాం నిండే ఆస్కారం ఉందని, దీంతో చివరి తడి పంటలకు నీరు పెట్టి పంటలను కాపాడుకుంటామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రైతులు బద్దం రమణారెడ్డి ఏలేటి పవన్, ఎం దశరథ్, మహేష్, రవీందర్ రెడ్డి, జి పెద్దబాబు, పి. గంగారెడ్డి తదితరులు కోరారు. రైతుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ తహసీల్దార్ రైతులకు వివరించారు.

### 'హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి'

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని బాలాజీ హోమ్స్‌లో శ్రీ హనుమాన్ మందిరం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ శంకుస్థాపనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య జీవితంలో ప్రతిరోజు సాధ్యమైనంత వరకు గుడికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

### 'సీసీఐ పత్తి కొనుగోళ్ల నిలిపివేత'

బోథ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ పరిధిలోని బోథ్, సోనాల, నేరడిగొండ, పొచ్చెర జిన్నింగులలో పత్తి నిల్వలు పేరుకు పోయినందున రెండు రోజులపాటు పత్తి కొనుగోలు ఉండవని మార్కెట్ కమిటీ సెక్రటరీ విట్టల్ తెలిపారు తిరిగి మూడవ తేదీన కొనుగోలు ప్రారంభమవుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని మార్కెట్‌కు పత్తిని తీసుకురావద్దని పేర్కొన్నారు.

### ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ : ఒకరి మృతి

బోథ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కుచలాపూర్ పొచ్చెర గ్రామాల మధ్యన శుక్రవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. బియ్యం బస్తాలతో ధన్నూర్ గ్రామంలోని తన కూతురు ఇంటికి వస్తున్న ఆటోలో లక్ష్మారెడ్డి వస్తున్నారు. అయితే ఎదురుగా వస్తున్న ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆటో ఢీకొనడంతో లక్ష్మారెడ్డి వీవీ అక్కడికక్కడే అభివృద్ధి చెందాడు. ఆటో డ్రైవర్ వసంత కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్‌ను నిర్మల్ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించడం జరిగింది. అయితే రోడ్డు ప్రమాదంలో ఆటో నుజ్జునుజు కాగా బియ్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. జరిగిన సంఘటన స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి ఎస్సై ప్రవీణ్ కుమార్ తో పాటు ఏఎస్ఐ లక్ష్మణ్ సిబ్బందితో హుటాహుటిన చేరుకున్నారు. గాయాల పాలైన డ్రైవర్‌ను మెరుగైన వైద్యం కోసం తరలించగా మృతి చెందిన వ్యక్తి శవాన్ని బోథ్ ఆసుపత్రికి తీసుకువచ్చి పోస్టుమార్టం చేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

● రేపటి నుంచి కూరలో స్వామివారి బ్రహ్మోత్సవాలు

జైనథ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర గ్రామంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఫిబ్రవరి 2వ తేదీ నుంచి జరిగే స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వివిధ రంగురంగులతో అలంకరించారు. దీంతోపాటు వివిధ రంగు రంగుల పూలు, వివిధ రంగులతో కూడిన విద్యుత్ బల్బులతో ఆలయాన్ని అలంకరించారు. ఫిబ్రవరి 2వ, 3వ తేదీల్లో మనోత్సవాలు, 4వ, 5వ తేదీల్లో బ్రహ్మోత్సవాలు, ఫిబ్రవరి 6న కల్యాణోత్సవం అన్నదాన కార్యక్రమం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు, ఫిబ్రవరి 7న చక్ర స్నానం, లక్షపు ప్పార్చన నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వర ఆలయం

# టీబీ రహిత సమాజానికి కృషి చేయాలి


క్షయనిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ సుమలత

మావల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సుమలత పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని రిమ్స్ కార్యాలయంలో తెలంగాణ ఆర్ఎంపీ అసోసియేషన్ సభ్యులతో కలిసి జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ఆర్ఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 3న సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో గల మాల సంఘ భవనంలో జిల్లాలో గల ఆర్ఎంపీలకు అవగాహన సదస్సు నిర్వహింపబడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆర్ఎంపిలు ప్రతీఒక్కరు హాజరుకావలన్నారు. ఈ కార్యక్రమమంలో తెలంగాణ ఆర్ఎంపి అసోసియేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు రామోజీ వీరాచారి, ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కావటి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బోజారెడ్డి, సుభాష్ గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి గజానన్ చౌహాన్‌లు పాల్గొన్నారు.

### కందుల కొనుగోలు ప్రారంభం

బోథ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పండించిన కంది పంటను కొనుగోలు చేసేందుకు గాను శుక్రవారం జిల్లా అధికారి ప్రవీణ్‌రెడ్డి కంది పంట కొనుగోలు కేంద్రాన్ని బోథ్ మార్కెట్ యార్డులో ప్రారంభించారు. క్వింటాలకు 7550 రూపాయలుగా ప్రభుత్వ మద్దతు ధర ఉందన్నారు. రైతులు 12శాతం చేమ ఉన్న కందులను తీసుకురావాలని అంత కంటే ఎక్కువ ఉంటే రైతులు నష్టపోతారని కొనుగోలు చేసేది లేదని పేర్కొన్నారు. ఇందులో బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి విట్టల్ , సహకార బ్యాంక్ మేనేజర్ శైలజ, సీనియర్ ఇన్స్పెక్టర్ జిల్లాలోద్దీన్ బోథ్ సిఈఓ, గోలి స్వామి, నేరడిగొండ సీఈవో బారే భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

### దాతల సహకారం అభినందనీయం

తలమడుగు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామ ఆలయ నిర్మాణానికి దాతల సహకారం ఎంతో అభినందనీయమని విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. శుక్రవారం రుయ్యాడి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన సుదారపు పోతన్న స్థలాన్ని విరాళంగా అందించినందుకు వారిని మాజీ డెయిరీ చైర్మన్, హస్సేన్ హుస్సేన్ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పూంద్రు పోతారెడ్డిలు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఇందులో గోక వెంకట్ రెడ్డి, సీఈవో శ్రీనివాస్, గంగాధర్, అశోక్, సంజీవరెడ్డి, ప్రకాష్ రెడ్డి,పొచ్చన్న, రాం కిష్ట, నర్సింలు, భీమన్న, సుభాష్, పండరి, తదితరులు పాల్గొన్నారు.

### మరో ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించండి

బోథ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన సోనాల గ్రామంలో మరో ఎంపీటీసీ స్థానాన్ని కేటాయించాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పీఏసీఎస్ డైరెక్టర్ లోల పోశెట్టి మంత్రి సీతక్కకు విన్నవించారు. జనాభా మండల కేంద్రంలో రూ.4వేల పైచిలుకు ఉందని అందుకు మరో ఎంపీటీసీ స్థానం కేటాయించాలని మంత్రికి సూచించగా ఈ విషయమై పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడితే నిర్ణయం తీసుకుంటారని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

### సమస్యలు పరిష్కరించండి

బోథ్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐకెపి ఉద్యోగులు జనవరి 29 నుంచి సమ్మె బాట పట్టారు. తమ నిరసన కార్యక్రమాలను రోజుకు రీతిగా నిర్వహిస్తున్నారు. పెన్షన్ సమ్మెలో ఒక భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

### సుంకిడిలో వాలీబాల్ పోటీల ప్రారంభం

తలమడుగు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి ఆధ్వర్యంలో యూత్‌కు వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ ఆటలు ఆడడం వల్ల శారీరకంగా మానసికంగా మంచి ఉత్సాహవంతులుగా తయారవుతారని అన్నారు. ఇందు లో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, పీడీ నాందేవ్, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణవేణి, రమాకాంత్, గ్రామ వ్యాయామ ఉపాధ్యాయుడు లింగారెడ్డి పాల్గొన్నారు.

### నాగోబా జాతరకు పోటెత్తిన భక్తజనం

(5వ పేజీ తరువాయి...)

దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొమురంసూరు విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్ ట్యాంకు బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో నాయక్‌పోడ్ తెగకు చెందిన వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతియేటా తీసుకుంటున్న దరఖాస్తులు ఏమవుతున్నాయో? అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. కనీసం ఎన్ని దరఖాస్తులకు పరిష్కారం చూపారో? చెప్పడం లేదన్నారు. రుణాలు ఇవ్వకుండా ఆదివాసీలను బ్యాంకులు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, గిరి వికాసం పథకాన్ని ఉమ్మడిగా కాకుండా ప్రతీ రైతుకు మంజూరు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో నాయక్‌పోడ్‌ల జనాభా ఎంత ఉందో? చెప్పాలన్నారు. మిగిలిపోయిన పోడు భూముల కు వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులు కాస్తు లో ఉన్న భూములను తిరిగి ఆదివాసీలకు ఇస్తే అడవుల జోలికి వెళ్లబోమన్నారు. ముఖ్యంగా ఆదివాసీ 9తెగలకు సంబంధించిన వారితో ఐటీడీఏ ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని ఇవ్వాలన్నారు. విద్య అవకాశాల్లో ఆదివాసీలకు ప్రత్యేక రిజర్వేషన్‌లను కల్పించాలన్నారు. అంతరించిపోతున్న తోటి, కోలాం తెగలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

#### ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

నాగోబా ప్రజాదర్బార్ పై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావం కనిపించింది. అధికారులు, ప్రజాప్రతినిదులు కలిసి దర్బార్‌లో పాల్గొనే అవకాశం లేకుండానే పోయింది. దీంతో ఆదివాసీల సమస్యలపై చర్చించకుండానే దర్బార్‌ను ముగించారు. మొదట జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దర్బార్‌ను ప్రారంభించి ప్రసంగాలు చేస్తున్న సమయంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు కలిసి ప్రజాదర్బార్ వద్దకు రావడంతో జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులంతా పక్కనే ఉన్న రూమ్‌లోకి వెళ్లి పోయా రు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యే కొద్ది క్షణాల్లోనే ప్రజాదర్బార్ నుంచి తిరుగుముఖం పట్టారు. అనంతరం యదావిధిగా జిల్లా కలెక్టర్ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్న సమయంలోనే కొద్దిసేపటికి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఎమ్మెల్సీ దండె విఠల్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్తుమల్లేష్, ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్రం సుగుణ, పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజాదర్బార్ వేదికపైకి రావడంతో ఆదివాసీ పెద్దలు వారికి స్వాగతం పలికారు. దీంతో మళ్లీ అధికారులు దర్బార్ వేదికను వదిలిపెట్టి పక్కనే ఉన్న రూంలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత ప్రజాదర్బార్‌లో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, పలువురు ప్రజాప్రతినిధులు దర్బార్‌ను ఉద్దేశించి ప్రసంగాలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో అధికారులకు తిప్పలు తప్పలేదు. రెండు సార్లు వేదికపై నుంచి వెళ్లి పోవాల్సి వచ్చింది. దగ్గరుండి మరి మంత్రికి స్వాగతం పలకాల్సిన జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రజాప్రతినిధులను చూసి ప్రజాదర్బార్‌కు దూరంగా వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.

### బ్యాంకు బయట నిలిపిన బైక్ చోరీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు బయట నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. భీంపూర్ మండలంలోని అర్లి(టి)కి చెందిన పిట్ల గంగయ్య గురువారం ద్వారక నగర్‌లోని ఇండియన్ బ్యాంకుకు వచ్చి తన బైక్(ఏపీ01ఏఐ2314)ను బయట పార్కింగ్ చేశాడు. లోపలికి వెళ్లి పని ముగించుకొని బయటకు రాగా.. చోరీకి గురైంది. దీంతో శుక్రవారం 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బోథ్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బోథ్‌లో జీడిపల్లి రోడ్డు పైన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని సాంగ్ గ్రామానికి చెందిన మడవి పరుశు రామ్ తీవ్ర గాయాల పాలయ్యాడు. వాహనం అదుపుతప్పి పడట్లు పోలీసులకు ప్రత్యక్షసాక్షులు సమాచారం అందించారు. అయితే క్షతగాత్రున్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆసుపత్రికి తీసుకు వెళ్లాడు. 108 అందుబాటులో లేకపోవడంతో సహకరించడంతో పలువురు అభినందించారు.



నాగోబా జాతర దృశ్యం



నాగోబా ఆలయంలోని నాగదేవత ప్రతిమ



గుస్సాడి సంస్కృతిక నృత్యాలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్




... ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కోనప్ప



## జాతరకు పోటెత్తిన జనం

నాగోబా జాతరకు భక్తులు, ఆదివాసీలు భారీగా పోటెత్తారు. నాగోబా దేవతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నాగోబా జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన కనిపించింది. దర్బార్‌కు హాజరైన ఆదివాసీలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారుల ముందు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ రాజార్షిషా అధ్యక్షతన ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ దర్బార్‌కు ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ హాజరయ్యారు.

● ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



జాతరకు భారీగా తరలివచ్చిన జనం



కొమురంభీంకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో



● ఆదివాసీల ఆడబిడ్డ, రాష్ట్ర మంత్రి సీతక్క సంస్కృతి, సంప్రదాయాలను పాటించడంలో ముందు వరుసలో ఉంటారు. ఇతరులకు చెప్పడే కాదు పాటించి చూపించారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క



పాల్గొన్న ఆదివాసీ మహిళలు

## జాతీయ జెండాతో కశ్మీర్ నుంచి కన్యాకుమారికి పాదయాత్ర



జాతీయజెండాతో పాదయాత్ర చేస్తున్న సనాతన ధర్మ పరిరక్షణ సభ్యుడు శివకరణ్‌సింగ్

ఇచ్చోడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయజెండాను చేతిలో పట్టుకుని, పాదాలకు చెప్పులు లేకుండా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరక పాదయాత్ర పాదయాత్ర చేపట్టాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పత్తేపూర్ జిల్లా ఖరౌలీకి చెందిన శివకరణ్‌సింగ్ దేశం, ధర్మం కోసం సనాతన సంస్కృతి పరిరక్షణతో పాటు యువతలో దేశ భక్తిని పెంపొందించేందుకు ఈ యాత్రను చేపట్టి నట్లు ఆయన వివరించారు. ఈ పాదయాత్రను దేశ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము జన్మస్థలం ఒడిశాలోని ఉపర్బెడ గ్రామంలో ముగుస్తానని చెప్పాడు. శుక్రవారం ఇచ్చోడ మండలంలోని విఠలేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న ఆయనను భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఇచ్చోడలోని విఠలేశ్వర ఆలయానికి చేరుకున్న శివకరణ్‌సింగ్‌ను 'ఆంధ్రజ్యోతి' పలకరిం చడంతో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. కార్యక్రమంలో భక్తులు ముస్తాపురె రామేశ్వర్, విజయ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

## బడిలో సాగు!

● బుగ్గారం(బీ) ప్రాథమికోన్నత పాఠశాలలో మాబడి తోట

● సాగు చేసిన కూరగాయలే మధ్యాహ్న భోజనానికి వినియోగం




పాఠశాలలో సాగైన ఆకు కూర

నేరడిగొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గారం(బీ) గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో మాబడి తోట కార్యక్రమంలో భాగంగా ఆకు కూరలు పండిస్తున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు సుమారు 100మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తూ ఆ పాఠశాల ఆవరణలో ఆకు కూరలు సాగు చేస్తున్నారు. సాగు చేసిన ఆకు కూరలనే మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నారు.



బడిలో సాగు చేసిన ఆకు కూరలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

# నేటి నుంచి పది విద్యార్థులకు అల్పాహారం



● మార్చి 20 వరకు అందజేత ● జిల్లాలో 3,225 మంది విద్యార్థులకు రూ.18.38 లక్షల కేటాయింపు ● పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు







విద్యార్థులకు అందించే స్నాక్స్

భైంసా, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, మోడల్ స్కూళ్లలో పదో తరగతి చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సర్కారు శనివారం నుంచి సాయంత్రం పూట అల్పాహారం అందించనుంది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దసరా తర్వాత చాలా చోట్ల ఇవి మొదలయ్యాయి. మధ్యాహ్నం 1గంటకు భోజనం తింటే, ప్రత్యేక తరగతులు పూర్తయి ఇళ్లకు వెళ్లే సరికి ఇతర గ్రామాల విద్యార్థులకు రాత్రి 7గంటలవుతోంది. అప్పటివరకు ఏమీ తినకపోవడంతో ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. గతంలో కలెక్టర్ల నిర్ణయం మేరకు కొన్ని పాఠశాలల్లో సాయంత్రం పూట స్నాక్స్ అందించేవారు. 2023లో విద్యాశాఖే సమగ్ర శిక్ష ద్వారా 34 రోజుల పాటు వాటిని అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది మాత్రం ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో అమలు కాలేదు. ఈ సారి మార్చి 21వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు మొదలవుతున్నందున ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20వ తేదీ మధ్య పాఠశాలలు నడిచే 38 రోజుల పాటు అల్పాహారం ఇవ్వనున్నారు.

### ● ఒక్కో విద్యార్థికి రూ. 15

స్నాక్స్ కోసం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 15 చొప్పున మంజూరు చేయనున్నారు. జిల్లాలో 116 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక మోడల్ స్కూల్‌లో కలిపి మొత్తం 3,225 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. సంబంధిత విద్యార్థులకు సాయంత్రం వేళలో అల్పాహారం అందించేందుకు గాను ప్రభుత్వం రూ.18,38,250 నిధులను కేటాయించింది. సంబంధిత నిధుల ద్వారా విద్యార్థులకు సాయంత్రం వేళలో ఉడకబెట్టిన పెసర్లు, పల్లీలు-బెల్లం, చిరుధాన్యాలతో చేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఉడకబెట్టిన బొబ్బర్లు, ఉల్లిపాయ పకోడి, ఉడకబెట్టిన శనగల్లో రోజుకు ఒక రకం ఇవ్వనున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల మహిళలే వాటిని సరఫరా చేయనున్నారు.

### మాలాంటి విద్యార్థులకు ప్రయోజనం



● రాధిక, పదో తరగతి, ఏపీ నగర్ హైస్కూల్, భైంసా

ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వం సాయంత్రం వేళలో అల్పాహారం అందించేందుకు గాను నిర్ణయం తీసుకోవడం మాలాంటి విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రయోజనకరం. పనులకు వెళ్లే తల్లితండ్రులు అల్పాహారం చేసి ఇవ్వడం కష్టంగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలల్లో ఉంటున్న పదో తరగతి విద్యార్థులు నిరసించి పోతున్నారు. ఇలాంటి విద్యార్థులకు సాయంత్రం వేళలో రోజుకో రీతిలో అల్పాహారం అందిస్తుండటం ఎంతో శుభపరిణామం.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

● రామారావు, డీఈవో, నిర్మల్



పదో తరగతి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో వ్యవహరిస్తోంది. ఉత్తమ ఫలితాల సాధనకు అన్ని విధాలుగా తోడ్పాటునిస్తోంది. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని సాయంత్రం వేళలో అల్పాహారం అందించేందుకు చర్యలు చేపట్టింది. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళికబద్ధంగా చదువుకోవాలి. ప్రతి పాఠశాలలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి.



ఖానాపూర్‌లో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

## నేడే ఖానాపూర్‌లో సాయిబాబా జాతర

● భారీగా తరలిరానున్న భక్తులు ● మహా ప్రసాదానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

● సుమారు 80వేల మందికి అన్నదానానికి ఏర్పాట్లు

● ఖానాపూర్‌లో వైభవంగా శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ వార్షికోత్సవ వేడుకలు



జాతర సందర్భంగా ఏర్పడ్డ దుకాణ సముదాయాలు

ఖానాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ప్రాంతంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సాయిబాబా జాతరకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. శ్రీ వీరాంజనేయ శివసాయి సమాజ్ ఆలయ 28వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో అత్యంత వైభవంగా జాతర నిర్వహించనున్నారు. జాతరను పురస్కరించుకొని శనివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ పూజా కార్యక్రమాలకు హైదరాబాద్‌కు చెందిన చండీ ఉపాసకులు పాలెం మనోహర శర్మ, ఆదిలాబాద్‌కు చెందిన గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతిలు హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్ తెలిపారు. ఈ జాతర ప్రత్యేకత మహా అన్నదానమని ఆయన పేర్కొన్నారు. ఈ మహా అన్నదానానికి సుమారు 80వేల మంది వరకు భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. 80వేల భక్తులకు సరిపడా అన్నదానం ఏర్పాట్లను ఇదివరకే సిద్ధం చేసినట్లు తెలిపారు. మహా అన్నదానానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇదివరకే 40 క్వింటాళ్ల బియ్యాన్ని విరాళంగా అందజేశారని పేర్కొన్నారు. జాతరను పురస్కరించుకొని భారీగా తరలిరానున్న భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లను చేసినట్లు రాజేందర్ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.7 : కనిష్ఠం 18.5







# సర్కారు దవాఖానాపై కబ్జాల పడగ

- కబ్జారాయుళ్ల ముట్టడిలో సారంగాపూర్ పీహెచ్‌సీ
- పేదల ఆరోగ్యం కోసం స్థలం బహుమానంగా ఇచ్చిన దాతలు
- దురాక్రమణలతో కుశించుకుపోతున్న దవాఖానా స్థలం
- పంచాయతీ శాఖకు పట్టదు.. రెవెన్యూ శాఖ ముట్టదు..
- ఆందోళనతో సర్వేకు అధికారుల నిర్ణయం

నిర్మల్, జనవరి 31 ( ఆంధ్రజ్యోతి ) : తమ తండ్రి జ్ఞాపకార్థం ఆ ప్రాంత పేదలకు ఆరోగ్యం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వాసుపత్రి నిర్మాణం కోసం దాతలు స్థలాన్ని ఇస్తే.. కబ్జారాయుళ్ల పడగ విప్పడంతో ప్రభుత్వాసుపత్రి స్థలాలు దురాక్రమణకు గురవుతున్నాయి. ప్రభుత్వాసుపత్రి స్థలం అని తెలిసినప్పటికి అడిగేవారు లేకపోవడంతో క్రమంగా ఆసుపత్రి స్థలాలు కుశించుకుపోతున్నాయి. సారంగాపూర్ మండల కేంద్రం లో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్థలాలు కబ్జారాయుళ్ల చేతిలో రోజురోజుకు అన్యాక్రాంతమవుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పడిగేల రాజేశ్వర్ ఆయన సోదరుడు లక్ష్మణ్‌లు కలిసి వారి తండ్రి దివంగత పడిగేల కిష్టన్న స్మారకార్థం ప్రస్తుత పిహెచ్‌సీ నిర్మాణం కోసం రెండు ఎకరాల పది గుంటల స్థలాన్ని దానం చేశారు. దవాఖానా నిర్మాణానికి కూడా వారే నిధులు ఇచ్చి కట్టించారు. కనీస ఆరోగ్య సేవలు అందని ఆ రోజుల్లో పడిగేల కిష్టన్న స్మారక ప్రభుత్వాసుపత్రి వేలాది మంది రోగులకు సేవలు అందించింది. దీంతో ఈ ఆసుపత్రికి మంచి గుర్తింపుతో పాటు పేరు కూడా వచ్చింది.

### కబ్జాలతో ఆసుపత్రి స్థలాలు అన్యాక్రాంతం

ప్రభుత్వ డిస్పెన్సరీ కాస్త ప్రాథమిక ఆరోగ్యకేంద్రంగా అప్‌గ్రేడ్ అయ్యింది. దీంతో ఇదే స్థలంలో కొత్త భవనం కూడా నిర్మించారు. గతంలో నిర్మించిన పాత ఆసుపత్రి భవనాన్ని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, 108 సేవల కోసం వినియోగిస్తున్నారు. అయితే ఈ ఆసుపత్రికి సంబందించిన రెండు ఎకరాల పది గుంటల స్థలం పూర్తిగా ఆసుపత్రికే చెందాల్సి ఉండగా క్రమంగా కబ్జాలకు గురవుతూ వస్తున్నది. అప్పట్లో ఒక రాజకీయ ప్రజా ప్రతినిధి ఆసుపత్రి స్థలాన్ని ఆనుకొని ఇళ్లు నిర్మాణం చేసి ఒకరికి అమ్మారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు అప్పట్లోనే మరొకరు రేకుల గుడిసె వేసి స్థలం కబ్జా పెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఇక ఇటీవల కాలంలో పాత ఆసుపత్రి ప్రహరీగోడను ఆనుకొని వరుస కబ్జాలు పెరిగిపోయాయి. ఆసుపత్రి ప్రహరీగోడను ఆనుకొని రేకుల టేలాలు వేస్తూ క్రమంగా కబ్జాలు పెంచేశారు. దీంతో ఆసుపత్రి స్థలాలు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు ఆసుపత్రి స్థలం లోపలి వైపు మరో రెండు టేలాలు వేయడంతో వివాదం ముదిరింది. ఈ ఆక్రమణలపై గ్రామ ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అధికారులు ఇప్పుడు ఆక్రమణలపై దృష్టి సారించారు. గతంలో పలుసార్లు ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ అటు పంచాయతీరాజ్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు వివాదం పరిష్కారడంలో నేపాన్ని ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ వస్తున్నారు. మరోవైపు ఆసుపత్రికి కేటాయించిన స్థలం కొంత ఆర్ అండ్ బి శాఖ రోడ్డు నిర్మాణ సమయంలో రోడ్డు పరిధిలోకి వెళ్లినట్లు కూడా చెబుతున్నారు. అయితే ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే వేసిన టేలాలను ఆ శాఖ అధికారులు కూడా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. అయితే దీనిపై కొందరు గ్రామస్థులు ఆసుపత్రి సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ఆసుపత్రి సిబ్బంది గతంలోనే తాము ఫిర్యాదులు చేశామని, తాము సమస్యను పరిష్కరించుకోలేని పరిస్థితిలో ఉన్నామని రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో గురువారం తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, మండల పంచాయతీ అధికారి అజీజ్ ఖాన్, మండల సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, ఆసుపత్రి పర్యవేక్షకులు కలిసి తాజాగా జరుపుతున్న షెడ్డు నిర్మాణాలను నిలిపివేయించారు. పూర్తిగా సర్వే జరిగే వరకు ఎవరు కూడా నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. ఆసుపత్రి స్థలాల్లో ఆక్రమణలు తెలితే త్వరలోనే చర్యలు తీసుకుంటామని కూడా అధికారులు వెల్లడించారు.

### రాజకీయ ఒత్తిళ్లు

సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలాలు దూరాక్రమణ విషయంలో పలువురు రాజకీయ నాయకుల ఒత్తిడిలు కూడా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికార పార్టీలో కొనసాగుతున్న ఇద్దరు నాయకులు ఈ స్థలాలను దురాక్రమణ చేసి ఇతరులకు అమ్మిన ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే తాజాగా ప్రత్యర్థి వర్గానికి చెందిన రాజకీయ పార్టీల నేతలు తాము కూడా ఏమి తీసిపోలేమన్నట్లుగా తమ నేతలతో అధికారులపై ఒత్తిడి తీసుకువస్తూ ఆక్రమణలు చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా స్థలాలు ఆక్రమించుకుంటుపోతున్నారు. ఆక్రమణలను తొలగించాలని ఒత్తిడి చేస్తే వాళ్ళు తీస్తే మేం తీస్తాం... లేదంటే ఇంకా కొత్త రేకుల షెడ్లు వేస్తామంటూ అధికారుల మోహం మీదే బెదిరిస్తున్న సందర్భాలు ఎదురవుతున్నాయి. దీంతో సర్కారు దవాఖాన స్థలాలు పూర్తిగా అన్యాక్రాంతమయ్యే పరిస్థితులు ఉన్నాయి. గతంలో దాతలు ఇచ్చిన స్థలాన్ని సర్వే నంబర్‌ల ఆధారంగా పూర్తిగా గుర్తించి హద్దులు వేసి ఆక్రమణలను తొలగిస్తే భవిష్యత్ తరాలకు ఆసుపత్రి సేవలు అందే వీలుంది. సారంగాపూర్‌లో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం సైతం మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కృషి చేస్తున్నారన్న ప్రచారం కూడా ఉంది. ఒకవేళ 30 పడకల ఆసుపత్రి మంజూరు కావాలంటే కనీసం రెండున్నర ఎకరాల స్థలం చూపాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇలా ఆక్రమణలకు స్థలం గురవుతుంటే సారంగాపూర్‌లో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం ఒక కళగానే మిగిలిపోతుందన్న ఆవేదన గ్రామస్థుల్లో ఉంది.



సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇదే

### అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం

శ్రీదేవి, తహసీల్దార్, సారంగాపూర్

ఈ విషయమై సారంగాపూర్ తహసీల్దార్ శ్రీదేవిని సంప్రదించగా... మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన భూముల్లో కబ్జా పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2012 సంవత్సరంలో కోర్టులో ఉత్తర్వుల ప్రకారం ఈ భూమి ముమ్మాటికి ప్రభుత్వ ఆసుపత్రిదేనని తెలిపారు. తమ వద్ద ప్రస్తుతం రికార్డులు లేవని, సదరు ఆసుపత్రి డాక్టర్‌కు భూమికి సంబంధించిన పత్రాలు సమర్పించాలని కోరినట్లు తెలిపారు. గతంలో ఒక వ్యక్తి తన పట్టా భూమిని ఆసుపత్రి నిర్మాణం కోసం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేస్తున్నట్లు ఆసుపత్రి దృష్టికి వచ్చిందని తెలిపారు. సదరు ఆసుపత్రి సిబ్బంది భూమికి చుట్టూ పెన్సింగ్ వేసుకొని రక్షణ కల్పించాలన్నారు. అక్రమార్కులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని ఆమె వివరించారు.

## బాసరకు వసంత శోభ

- నేటి నుంచి అమ్మవారి జన్మదిన వేడుకలు
- మూడు రోజుల పాటు వైభవంగా కొనసాగనున్న ఉత్సవాలు
- ఈ సారి ప్రతిష్టాత్మంగా తీసుకున్న యంత్రాంగం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



విద్యుత్ దీపాలతో అలంకరించినఅమ్మవారి ఆలయం

బాసర, జనవరి, 31 : (ఆంధ్రజ్యోతి) : చదువుల మాత సరస్వతీ దేవి కొలువై ఉన్న బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రానికి ఉత్సవకళ సంతరించుకుంది. శనివారం నుండి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో చివరి రెండు రోజులు భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ సారి ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం ప్రతిసారిలాగే ఈ సారి కూడా దేవస్థానం ఆధ్వర్యంలో అదనపు క్యూలైన్లు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతి వంటి ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు ఉప ఆలయాన్నింటికి రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

### ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి

ఈ సారి వసంత పంచమి వేడుకల ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేకదృష్టి సారించింది. మొదటి నుండి ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ వేడుకల నిర్వహణపై శ్రద్ధ వహించారు. అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలిచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలిగించరాదంటూ అధికారులను అప్రమత్తంగా చేశారు. జిల్లా ఇన్‌చార్జీ సీతక్క కూడా ఏర్పాట్లపై బాసర వచ్చి పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు.

### భారీ భద్రత

ఈ సారి ఉత్సవాలకు రెండు రోజుల పాటు భక్తుల రద్దీ అధికంగా వచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ పార్కింగ్ స్థలాలను కేటాయించారు. భైంసా డివిజన్ పరిధిలోని పోలీసులందరూ వసంతపంచమి వేడుకల్లో విధులు నిర్వహించనున్నారు. ఎస్పీ జానకిషర్మిల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

### అక్షరాభ్యాసాలు తప్ప ఇతర సేవలు రద్దు

మూడు రోజుల ఉత్సవాల రోజుల్లో ఆలయంలో భక్తులు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో మార్పులు చేశారు. ఉత్సవాలకు వచ్చే యాత్రికుల్లో 90 శాతం అక్షర శ్రీకార భక్తులు ఉన్నందున మిగతా భక్తులు నిర్వహించుకునే అభిషేకం, కుంకుమార్చన, ఇతర పూజా కార్యక్రమాలన్నింటినీ రద్దు చేశారు.

### భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దు : కలెక్టర్

వసంత పంచమిని పురస్కరించుకొని బాసరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాసరలో పర్యటించిన కలెక్టర్ వసంత పంచమివేడుకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా గోదావరినదితీరంలో పుష్కరఘాట్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. నదీ తీరంలో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని సూచించారు. భక్తులు దుస్తులు మార్చుకునే గదులను మరిన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నది వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనంతరం దేవస్థాన అతిథిగృహంలో ఆలయ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆలయం వద్ద కూడా బేబీ ఫీడింగ్ ప్రదేశాలను, బయో టాయిలెట్‌లను, తాగునీటిని నిరంతర పారిశుధ్య పనులను కొనసాగించాలని ఆదేశించారు. ప్రతీచోట భక్తులకు సౌకర్యవంతంగా బోర్డులను, కంట్రోల్ రూమ్, హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డిని ఉత్సవాల ప్రత్యేకాధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.

## ఘనంగా సప్తాహం

సారంగాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల హనుమాన్ మందిరం వద్ద శుక్రవారం ఘనంగా సప్తాహాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు ఆనవాయితీగా వారం రోజుల పాటు పూజలు చేసి, డప్పు మేళాల మధ్య వీధుల్లో గ్రామస్థులు ఊరేగింపుగా వెళ్లి వీధుల్లో అక్కడక్కడ ఏర్పాటు చేసినటువంటి ఉట్టీలను పగలగొట్టారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామస్థులందరూ హాజరయ్యారు. దీంతో పండగ సందడి నెలకొంది.

### ఉరి వేసుకుని ఒకరి మృతి

నర్సాపూర్(జి), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కోడె ప్రభాకర్(40) భార్య గత నాలుగు సంవత్సరాల క్రితం చనిపోవడంతో అప్పటి నుండి అతను మద్యం తాగుడికి బానిసయ్యాడు. ఎలాంటి పని చేయడం లేదు. ప్రభాకర్ మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం తన ఇంట్లో గల దూలానికి ఉరి వేసుకొని చనిపోయాడు. మృతుడి అక్క కోడె సత్తవ్వ నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

ఖానాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో ఖానాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్‌లో ఆయన పాల్గొని ప్రజలకుపలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేరాల నియంత్రణ కోసం పోలీసుల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్డెన్ అండ్ సెర్చ్‌కి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్య క్రమంలో ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో సందిగ్ధం

- విద్యార్థులకు విడుదల కానీ హాల్ టికెట్లు

నిర్మల్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరిగే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై ఇంకా సందిగ్ధం కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదల చేయని కారణంగా పరీక్షలు ఉంటాయా... ఉండవా అనే సందిగ్ధంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు ఉన్నారు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల సంఘం ఇదివరకే జిల్లా ఇంటర్మీ డియట్ విద్యాధికారి అధికారులను కలిసి త్వరలో జరగాల్సిన ప్రయోగ, వార్షిక పరీక్షలు తమ కళాశాలల్లో నిర్వహించమని తెలిపారు. ఇదే విషయం జిల్లా విద్యాధికారిని 'ఆంధ్రజ్యోతి' చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

### పేద కుటుంబానికి సహాయం

నిర్మల్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పేద మహిళ కుటుంబానికి చిరు సహాయం చేసినట్లు తెలిపారు. పట్టణంలోని సోమవార్‌పేట్‌కు చెందిన పేద మహిళ ఇటీవల అకాల మరణం చెందడంతో వారి కుటుంబానికి బియ్యం, కిరాణాసామాన్లు, నగదు ఇచ్చినట్లు తెలిపారు.

## పదిలో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



సమావేశానికి హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవతరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మూడుసార్లు హాజరు విధానం ప్రారంభించినట్లు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. వేరే గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విధంగా బస్సులను నడిపేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న ఐదురోజుల లోపల అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామసభలను ఏర్పాటు చేసి, విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. ఈ గ్రామసభల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి, విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యే విధంగా ప్రోత్సహించాలన్నారు. గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లారాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మధ్యంతర సన్నద్ధ పరీక్షలు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని, ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిరంతరం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులు సందేహాలను నివృత్తి చేయాలని పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలని, పాఠాలను సులభంగా గుర్తుంచుకునే విధంగా మెళకువలు నేర్పించాలన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ తరగతులకు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులు క్రమం తప్పకుండా బడులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు అంకితభావంతో పని చేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతానికి సంబంధించిన వివరాల నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. ఎంఈవోలు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. టిశాట్, తదితర విద్యా మాధ్యమాల ద్వారా విద్యార్థులకు సబ్జెక్టులలో మెళకువలను నేర్పించాలన్నారు. త్వరలోనే మండలాల్లో విషయ అవగాహన కలిగిన ఉపాధ్యాయులతో అనువైన పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా పరీక్షల్లో ప్రశ్నలు అడిగే విధానం, సమయ వినియోగం, పాత ప్రశ్న పత్రాల వివరణ, పరీక్షల ఒత్తిడిని అధిగమించుట తదితర అంశాలను వివరించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో పి. రామారావు, డీపీవో శ్రీనివాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు పద్మ, సలోమి కరుణ, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా నూతన క్యాలెండర్, డైరీని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై శ్రద్ధ వహించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

ముథోల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతుల విద్యార్థులకు సంబంధించిన హాజరు పట్టికను, తదితరవి పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులను అడిగి పాఠాలు సరిగ్గా చెబుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

కుంటాల, జనవరి, 31 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని అందకూర్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి అత్తమ్మ నర్సమ్మ ఇటీవల మృతి చెందడంతో శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు సోలంకి భీంరావు, పసుల నవీన్, వెంగల్ రావు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు కౌమారదశలో ఒత్తిడులకు లోను కావద్దు

- జిల్లా విద్యాధికారి రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

నిర్మల్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కౌమార దశలో ఒత్తిడులకు ఒడిదుడుకులకు లోను కాకుండా క్రమశిక్షణతో చదువులో ఏకాగ్రత చూపిస్తూ జీవితంలో రాణించాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కౌమారవిద్య, హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై పోస్టర్ మేళా కార్యక్రమంలో మొదటి బహుమతి హర్షిత కేజీబీవీ (దిలావర్‌పూర్), రెండవ బహుమతి శ్రాగ్వి వాసవి హైస్కూల్, భైంసా కన్సోలేషన్ బహుమతి సృజన్ కుమార్ జడ్పీహెచ్‌ఎస్ (పార్‌పెల్లి)లకు డీఈవో రామారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య క్వాలిటీ కోఆర్డినేటర్, డి. మోహన్‌రావు ఎస్‌జీసీ కోఆర్డినేటర్, విజయ్‌కుమార్ ఎంఈవో, వినోద్ కుమార్ డీఎస్‌వో, ఎల్ఎస్ఐ సీటీసీ కోఆర్డినేటర్ గంగా సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ముజ్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో రామారావు ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నర్సారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర

నేడు చించాలలో జాతర



శోభాయాత్రలో భక్తులు

ముథోల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించాల గ్రామంలోని హనుమాన్ ఆలయంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహంలో భాగంగా శుక్రవారం భక్తులు ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. నారాయణ మహారాజ్ యాతల్‌కర్ నేతృత్వంలో ప్రత్యేక వాహనంలో భక్త తుకారాం మహారాజ్, విఠల్ రుక్మాయి దేవుళ్ల చిత్రపటాలతో శోభాయాత్రలో భజన భక్త మండలి కీర్తనలు చేస్తూ దిండి కార్యక్రమం చేపట్టారు. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. శనివారం సప్తాహం ముగింపు సందర్భంగా జాతర జరుగనుంది. ఈ కార్యక్రమంలో విఠల్, ధర్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

### కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో మాతృపితృ వందనం



సోన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో మాతృ పితృవందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు తల్లిదండ్రులు యందు గౌరవాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు మొదట విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల కోసం ఎంతో కష్టపడతారని వివరించారు. ఆ కష్టానికి జీవితంలో పిల్లలు సేవ చేసిన రుణం తీరదని, తల్లిదండ్రులను చక్కగా చూడాలని చెప్పారు. తర్వాత విద్యార్థులచే తల్లిదండ్రుల పాదాలకు పువ్వులతో పాదాభివందనాలు చేశారు. తమ తల్లిదండ్రులు చెప్పినట్టు విని చక్కగా చదువుతామని, పెద్దవారైన తర్వాత చాలా చక్కగా తమ తల్లిదండ్రులను చూస్తామని వారి వారి తల్లిదండ్రులకు మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పరమేశ్వర్, ఇన్‌చార్జి ఉపాధానోపాధ్యాయులు రమేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.